# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 03-11-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేసి వలసలు అరికడతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.**

2. **రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను నిర్విరామంగా కొనసాగిస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.**

3. **రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయి.**

4. **రాజధాని అమరావతిలో చేపట్టే ప్రాజెక్టులపై ఆ ప్రాంత రైతులకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ.. సీఆర్‌డీఏ అవగాహన సదస్సు నిర్వహించింది.**

5. **ఇసుక అక్రమ నిల్వలపై డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేస్తామని విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు వివరించారు.**

==========================

రాష్ట్రంలో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేసి వలసలు అరికడతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ రోజు ఆయన శ్రీకాకుళంలో మాట్లాడుతూ.. 2025 నాటికి వంశధార రెండవ దశ పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. ఉత్తరాంధ్రలో ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పారన్నారు. గత ఐదేళ్ల నీటిపారుదల ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని కేంద్ర మంత్రి విమర్శించారు. శ్రీకాకుళం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని రామ్మోహన్ నాయుడు వివరిస్తూ..

వాయిస్ ( 31 )

-------------------------

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను నిర్విరామంగా కొనసాగిస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని ఈ రోజు ఉదయం ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో మంత్రికి.. వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపల నాదెండ్ల మనోహర్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

-------------------------

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి రోజు

గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రసంగం ఉంటుంది. అదే రోజు ఉదయం 10 గంటలకు బడ్జెట్ ప్రవేశపెట్టే యోచనలో ప్రభుత్వం ఉంది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఈ నెలాఖరుతో ముగుస్తున్నందు వల్ల ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. బడ్జెట్‌తో పాటు ప్రభుత్వం ఇతర బిల్లులను సభ ముందు ప్రవేశపెట్టనుంది. ఈ క్రమంలో ఇప్పటికే పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ఆర్ధిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కసరత్తు చేస్తున్నారు.

---------------------------

ఇసుక అక్రమ నిల్వలపై డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేస్తామని విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. స్టాక్‌యార్డ్, చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. వీటిని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేసి.. ఇసుక రవాణాను పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. ఇసుక అక్రమ నిల్వ, అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

---------------------------

పశ్చిమగోదావరి జిల్లాలో ఉచిత ఇసుక పంపిణీ సజావుగా చేపట్టేందుకు నియోజకవర్గాల వారీగా స్టాక్ పాయింట్లను, ఏజెన్సీలను గుర్తించే చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. భీమవరంలో జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అద్నాన్ నయీం అస్మీతో కలిసి ఆమె ఇసుక రవాణాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇసుక అందుబాటులో లేనందున పొరుగు జిల్లాల నుంచి నిల్వ చేసేందుకు అనువైన స్టాక్ పాయింట్లను, ఏజెన్సీలను గుర్తించాలని సూచించారు. స్టాక్ పాయింట్లకు చేర్చి ఏజెన్సీల ద్వారా అమ్మకాలు చేపట్టేందుకు ధరలను నిర్ణయించాలన్నారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా గృహ అవసరాలకు ఇసుకను తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనుమతులను జారీ చేసిందని, అందుకోసం సంబంధిత సచివాలయంలో ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

---------------------------

రాష్ట్రంలో దీపం 2.0 పథకంలో భాగంగా ఉచిత సిలిండర్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని మొత్తం రేషన్ కార్డులతో పోలిస్తే అర్హుల సంఖ్య తక్కువగా ఉంది. ఆధార్, రేషన్ కార్డు, గ్యాస్ కనెక్షన్ ఆధారంగా రాయితీ వర్తింపజేస్తున్నామని.. వాటి వివరాలు లేకపోవడంతోనే అర్హుల సంఖ్య తగ్గిందని అధికారులు వివరిస్తున్నారు. రాష్ట్రంలో కోటీ 54 లక్షల గృహ వినియోగ వంటగ్యాస్ కనెక్షన్లు ఉంటే.. తాత్కాలిక అంచనా ప్రకారం ఉచిత సిలిండర్‌కు కోటీ 8 లక్షల కనెక్షన్లు అర్హత పొందాయి. కానీ, రేషన్ కార్డులు కోటీ 48 లక్షలు ఉన్నాయి. కొంత మందికి గ్యాస్ కనెక్షన్, రేషన్ కార్డులున్నా.. ఆధార్ వివరాలు ఇవ్వకపోవడంతో అర్హత పొందలేకపోయారని.. వారు ఆధార్ అనుసంధానించుకుంటే 'దీపం 2.0' పథకానికి అర్హులవుతారని అధికారులు తెలిపారు.

---------------------------

రాజధాని అమరావతిలో చేపట్టే ప్రాజెక్టులపై రైతులకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ.. సీఆర్‌డీఏ అవగాహన సదస్సు నిర్వహించింది. గుంటూరు జిల్లా తుళ్లూరులో నిన్న నిర్వహించిన ఈ సదస్సులో రైతులతో సీఆర్‌డీఏ అధికారులు, ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు..ఏడీబీ ప్రతినిధులు సమావేశమయ్యారు. వారి నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా రైతుల సందేహాలను సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ నివృత్తి చేశారు. అమరావతి నిర్మాణం కోసం ప్రపంచబ్యాంకు, ఏడీబీ విధించిన నిబంధనలను వారికి వివరించారు. రైతులు చెప్పిన అంశాల్లో 80శాతం సీఆర్డీఏ ఒప్పందంలో ఉన్నాయని సీఆర్డీఏ కమిషనర్ పేర్కొంటూ..

వాయిస్ (30 సెకన్లు)

ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో ఈ రోజు నుంచి ఈ నెల 10వ తేదీ వరకూ 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సు జరుగుతోంది. ఆ సదస్సులో పాల్గొనేందుకు కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ ఇండియా రీజియన్ స్టీరింగ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలి హెూదాలో రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆస్ట్రేలియా వెళ్లారు. ఈ సదస్సుకు 50 దేశాల నుంచి ప్రతినిధులు హాజరు అవ్వనున్నారు. ప్రపంచంలో మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, చట్టసభల్లో మహిళల ప్రాధాన్యం తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చిస్తారు.

--------------------------

ఈ నెల 6 వ తేదీ నుంచి వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమం ద్వారా 15 సంవత్సరాలు పైబడిన వారందరికీ డిజిటల్ విద్య శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని వయోజన విద్య శాఖ ఉప సంచాలకులు కె.ఆంజనేయులు తెలిపారు. శనివారం అనంతపురంలో వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో అధికారులకు ఉల్లాస్ కార్యక్రమ శిక్షణ తరగతుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. వయోజనులను అక్షరాస్యులుగా చేయడమే ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వం నిర్దేశించిన 100 గంటల శిక్షణలో భాగంగా ప్రతి రోజు సాయంకాలం 5 గంటల నుంచి 7 గంటల వరకు వయోజనులకు తరగతులు ఏర్పాటు చేస్తున్నామని వివరిస్తూ

వాయిస్ (30 సెకన్లు)

--------------------------

వైయస్సార్ జిల్లాలో చట్ట విరుద్దంగా మద్యం అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వి.హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. గత వారం రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 284 బెల్ట్ షాపులను గుర్తించి దాడులు నిర్వహించామని ఆయన తెలిపారు. 115 కేసులు నమోదు చేసి 371 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని 119 మందిని అరెస్ట్ చేశామని వెల్లడించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తూ గతంలో పట్టుబడిన పాత నేరస్థులు 213 మందిని బైండోవర్ చేశామన్నారు. కేవలం ప్రభుత్వ అనుమతి పొందిన దుకాణాల్లోనే మద్యం విక్రయించాలని, నిబంధనలు ఉల్లంఘించి విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హర్షవర్ధన్ రాజు స్పష్టంచేశారు.

--------------------------

అవినీతి రహిత సమాజం రూపకల్పనకు, దేశాభివృద్ధికి యువత భాగసామ్యం కావాలని నెహ్రూ యువ కేంద్రం యువజన అధికారి సుంకర రాము పిలుపునిచ్చారు. విజయవాడలోని నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో విజిలెన్స్ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యువజన సర్వీసుల శాఖ మేనేజర్ సుబ్బారావు మాట్లాడుతూ.. అక్రమార్జన ద్వారా వచ్చే ఆదాయాలను ఆశించకుండా సక్రమంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ అధికారులను మేల్కొల్పడంలో ఎన్జీవోల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.

=====================